క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: పెదకాకాని సెక్షన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్ విద్యుత్తు లైన్ మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల ఏఈ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, కాశీ గార్డెన్స్, ఆటోనగర్, బైపాస్, నంబూరు గ్రామాల్లోని కొన్ని ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

వృద్ధురాలిపై అత్యాచార యత్నం

పెదనందిపాడు(కాకుమాను): పెదనందిపాడులో మంగళవారం వేకువ జామున ఓ యువకుడు వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడి గాయపరచినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు(85) తన పనులు ముగించుకుని గాఢ నిద్రలో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు వృద్ధురాలిని గాయపరచి అత్యాచారానికి పాల్పడడంతో వృద్ధురాలు కేకలు వేసింది. దీంతో యువకుడు పరారైనట్లు ఆయన తెలిపారు. వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారానికి యత్నించిన యువకుడిని మంజుగా గుర్తించి కేసు నమోదు చేసి వైద్య పరీక్షల నిమిత్తం వృద్ధురాలిని బాపట్ల ప్రజా వైద్యశాలకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ భాషా, ట్రైనీ డీఎస్పీ గీత, ప్రత్తిపాడు సీఐ నిసార్ భాష గ్రామంలో పర్యటించి పూర్తి వివరాలను సేకరించారు.

సీఆర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి సూచించారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని సీఆర్ కాలనీలో సిమ్స్ ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్యామల మాట్లాడుతూ ఈ మెడికల్ క్యాంపు ఏడు రోజులు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



పొన్నూరు: వరిగడ్డి రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్లు సమయ పాలన పాటించకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పి.భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఉదయం 6 గంటల లోపు, రాత్రి 10 గంటల తర్వాత పట్టణంలోని ప్రధాన రహదారిలోకి వరిగడ్డి ట్రాక్టర్లను తీసుకురావాలని డ్రైవర్లకు సూచించారు.

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా పద్మజ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్‌గా ఎం.పద్మజ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జి.సిద్ధార్థను ప్రకాశం జిల్లాకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో నెల రోజుల క్రిందట నెల్లూరు జిల్లా కలెక్టరేట్ సి సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రాఘవేంద్రరావును ప్రత్తిపాడుకు బదిలీ చేశారు. అయితే తాజాగా రాఘవేంద్రరావును ఫిరంగిపురం బదిలీ చేసి అక్కడ విధుల్లో ఉన్న పద్మజను ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె ప్రత్తిపాడులో విధుల్లో చేరారు.

కేర్ కిట్‌ల పంపిణీ



గుంటూరు మెడికల్: నవజాత శిశు సంక్షేమ హోం బేస్డ్ నియోనేటల్ కేర్ కిట్‌లను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి వైద్య సిబ్బందికి అందజేశారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో జిల్లాలో పనిచేస్తున్న 1,180 మంది ఆశా కార్యకర్తలకు నియోనేటల్ కేర్ కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త ఈ కిట్‌ను ప్రతి బాలింతకు అందజేయాలన్నారు. బాలింత ఇంటిని సందర్శించి వాటిలోని ప్రతి ఐటమ్ ను ఏ విధంగా వినియోగించాలో బాలింతలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ శాంతకుమారి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావం.. పేదల జీవితాలకు వరం

- నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- పొన్నూరులో ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- ఏటుకూరులో వేడుకల్లో పాల్గొన్న ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



మురళీకృష్ణ నేతృత్వంలో ర్యాలీగా వెళుతున్న నాయకులు, అభిమానులు



వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

పొన్నూరు: ప్రజల కష్టాలెరిగిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని, నిరంతరం ప్రజలకు మేలు చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో మురళీకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని తెలగ పాలెంలో వైఎస్సార్ సీపీ పార్టీ జెండా ఆవిష్కరించారు. కూరగాయల మార్కెట్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్లలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు మురళీకృష్ణతో పాటు మాజీ చైర్ పర్సన్, పార్టీ బాపట్ల పరిశీలకులు డాక్టర్ నల్లమోతు రూత్ రాణి, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, మునిపల్లె పీఏసీఎస్ చైర్మన్ కోటా శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు షేక్ నాజర్, షేక్.సుభాని, అంబటి వెంకటేశ్వరరావు, మొల్ల కరీం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 13 ఏళ్లు పూర్తయ్యి 14వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఏ పార్టీకీ సాధ్యం కాని లక్ష్యాలను వైఎస్సార్ సీపీ సాధించిందన్నారు. అధికారంలోకి రాకముందు ప్రజల పక్షాన పోరాడి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే అజెండాగా ముందుకు వెళుతోందన్నారు. పార్టీ బలోపేతానికి పాటు పడిన ప్రతీ నాయకుడు, కార్యకర్తను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి పార్టీలో సముచిత స్థానం కల్పించారని అన్నారు. ఎంతోమంది సాధారణ పార్టీ కార్యకర్తలకు సైతం పార్టీ ఉన్నత పదవులు కట్టబెడుతున్నారని ప్రశంసించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పార్టీ పయనంలో ముఖ్య సంఘటనలు, సాధించిన లక్ష్యాలను నేతలు వివరించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ షర్మిల, గేరా కుమారి, షేక్ జానీ భాష, వట్టిప్రోలు రంగారావు, వడ్రాణం ప్రసాదరావు, నాగరాజు, దేవరకొండ గోపి, సర్పంచ్ భవనం వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలి

పెదకాకాని: వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ స్థాపించి 13 సంవత్సరాలు పూర్తి చేసుకుని 14వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన పెదకాకాని ప్రధాన సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ వేడుకలకు చాగంటి మురళీరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు గోళ్ల శ్యాంముఖర్జీ బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పరిపాలన సాగిస్తుందన్నారు. రాజన్న రాజ్యం లక్ష్యంగా జన హృదయాలను గెలుచుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో 13 సంవత్సరాలుగా పార్టీ దినదినాభివృద్ధి చెందిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం జరిగిన పరిణామాలు, పార్టీ స్థాపించాల్సిన పరిస్థితులపై వివరించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని, పార్టీ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాలని కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కత్తిరించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె నజీర్ అహ్మద్, ఆలపాటి రాఘవ, కొంకి రామారావు, బందెల ఉదయ్‌శంకర్, బండ్లమూడి బాను, నాయుడు ధను, షేక్ షరీఫ్, ఆలా శ్రీనివాసరావు, దంతాల శ్రీను, పెరుమాళ్ళ అనిల్‌కుమార్, చింతా కుమారస్వామి, ముడియాల మల్లికార్జునరెడ్డి, ఎస్‌కె ఆరిఫ్, గజ్జల సుబ్బాయమ్మ, ఎ సఫారిబాబు, కోటిపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయటం ద్వారా ఆంధ్రప్రదేశ్ కీర్తిని నలుదిశలా చాటేందుకు స్థాపించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ స్థాపించి 13 సంవత్సరాలు పూర్తయ్యి 14వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పార్టీని జగనన్న స్థాపించిన నాటి నుంచి ప్రజలకోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను టీడీపీ దాని తొత్తు పార్టీల నుంచి కాపాడి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయటం లక్ష్యంగా జగనన్న సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలంతా జగనన్నకు అండగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, దత్త పుత్రుడి పార్టీలు గుంపుగా జగనన్నపైకి వస్తున్నాయని ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెదకాకాని: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నంబూరులో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నంబూరు జయభారత్‌రెడ్డి నగర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళి మోహన్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్ రెడ్డి, పెదకాకాని పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోటిరెడ్డి, పొన్నూరు వ్యవసాయ యార్డ్ డైరెక్టర్ జొన్నల కరుణాకర్ రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షులు నంబూరు విజయ్ కుమార్, వైఎస్సార్ మండల ప్రధాన కార్యదర్శి కూసం తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు: చేబ్రోలు మండలం తోట్లపాలెం, సుద్దపల్లి గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చోట్ల మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తోట్లపాలెం గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ జెండాను ఎగుర వేశారు. తోట్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు తిరువీధుల అంజనాదేవి సుద్దపల్లి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కఠివరపు అజయ్ కుమార్, కె అశోక్ కుమార్, సయ్యద్ అన్వర్, మట్టుపల్లి పోతురాజు, సత్యనారాయణ, సుదాకర్, విలయమ్స్‌రాజు, కిరణ్, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు. చిన్నారి మట్టుపల్లి పునర్వీక పార్టీ జెండా, టోపీతో జగన్ మామ అంటూ చిట్టిపొట్టి మాటలతో ఆకట్టుకుంది.



బలసాని ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నంబూరులో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



పెదకాకానిలో కేక్ కట్ చేస్తున్న స్థానిక నాయకులు, అభిమానులు



పెదకాకానిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు, అభిమానులు

మహిళల ఆర్థికాభివృద్ధికి 'చేయూత'

- వైఎస్సార్ సీపీ సేవాదళ్ విభాగం జిల్లా కన్వీనర్ ఉద్దగిరి మురళి
- ప్రత్తిపాడులో నాలుగో విడత వైఎస్సార్ చేయూత సంబరాలు



మహిళలకు చేయూత నమూనా చెక్కును అందజేస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందిస్తుందని వైఎస్సార్ సీపీ సేవాదళ్ విభాగం జిల్లా కన్వీనర్ ఉద్దగిరి మురళి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ అవరణలో మంగళవారం వైఎస్సార్ చేయూత నాల్గవ విడత ఆసరా సంబరాలు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం జి. సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ అన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మురళి మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణకు మహిళలు మారు పేరన్నారు. రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా రుణ మాఫీ, అమ్మ ఒడి, ఆసరా, చేయూత.. ఇలా అనేక సంక్షేమ పథకాల ద్వారా నేరుగా మహిళల ఖాతాలకు నగదును బదిలీ చేస్తున్నారని చెప్పారు. ఏపీఎం సురేష్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత కింద ప్రత్తిపాడు మండలంలో 40-60 సంవత్సరాల మధ్య ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అక్క చెల్లెమ్మలకు ఏడాదికి రూ. 18,750 చొప్పున, మొదటి విడతలో 2,553 మంది మహిళలకు రూ. 4.79 కోట్లు, రెండవ విడతలో 2,368 మందికి రూ. 4.44 కోట్లు, మూడవ విడతలో 2,444 మందికి రూ.4.58 కోట్లు, నాల్గవ విడతలో 2,498 మందికి రూ.4.68 కోట్లు చొప్పున మొత్తం నాలుగు విడతల్లో 9,863 మందికి రూ.18.49 కోట్లు వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందని చెప్పారు.

కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ బూసి సువార్తమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు వాసిమళ్ల మరియమ్మ, పార్టీ నాయకులు గ్రామపార్టీ అధ్యక్షుడు గుజ్జుల శివారెడ్డి, దాసరి చెంచురామారావు, బూసి సుబ్బారావు, ఎంపీడీవో దుర్గాప్రసాద్, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికలయ్యే వరకు అందుబాటులో ఉండాలి

ఈఆర్‌ఓ, నగర కమిషనర్ చేకూరి కీర్తి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా సెలవులు తీసుకోకూడదని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల నిర్వహణపై పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్‌ఓలు, సూపరింటెండెంట్‌లతో మంగళవారం తన చాంబరులో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు కేటాయించిన వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈని, అభ్యర్థుల ప్రచార సామగ్రి ప్రింట్ చేసే ప్రెస్‌లకు ఎన్నికల నిబంధనల మేరకు తీసుకోవాల్సిన చర్యలపై నోటీసులు జారీ చేసి, వారితో సమావేశం నిర్వహించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో వీడియో రికార్డింగ్ చేయడానికి తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నామినేషన్లు స్వీకరించే గదుల్లో ఎస్ఈతో సమన్వయం చేసుకొని తగిన ఏర్పాట్లు చేయాలని మేనేజర్‌కు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏఈఆర్‌ఓలు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, వెంకటలక్ష్మి, సునీల్, నిరంజన్, ఏడీహెచ్ రామారావు పాల్గొన్నారు.

నెలాఖరు వరకే వడ్డీ రాయితీతో పన్ను చెల్లింపులు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటిపై వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఈ నెలాఖరు వరకే గడువు ఉందని నగర కమీషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో నిర్మాణంలో భవన యజమానులకు ఖాళీ స్థల పన్నుపై వడ్డీ రాయితీ సదవకాశమని, వెంటనే పన్ను చెల్లించాలని పేర్కొన్నారు. మార్చి తర్వాత వడ్డీ కలిపి చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన, సర్కిల్ కార్యాలయాలతో పాటుగా భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్‌లోని 148 వార్డు సచివాలయాల్లో క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

గీతాంజలి మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

- ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- ప్లకార్డులతో నిరసన తెలిపిన ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ మహిళా శ్రేణులు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బలసాని, వైఎస్సార్ సీపీ మహిళలు

గుంటూరు రూరల్: అభం శుభం తెలియని అమాయకురాలు గీతాంజలిని టీడీపీ, జనసేన సోషల్ మీడియా పొట్టన పెట్టుకుందని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయం వద్ద నియోజకవర్గ మహిళా శ్రేణులతో కలిసి ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలికి చెందిన గీతాంజలికి జగనన్న ఇంటి స్థలం మంజూరు చేశారని ఆమె తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ మీడియాతో మాట్లాడిందన్నారు. దీంతో టీడీపీ, జనసేన ఉగ్రవాదులు ఆమెను సోషల్ మీడియాల్లో ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ మాటల్లో చెప్పలేని విధంగా ఆమెను అసభ్యంగా ట్రోల్ చేశారన్నారు. ముక్కుపచ్చలారని ఆమె ఇరువురు చిన్నారులు తల్లిలేని వారయ్యారని విచారం వ్యక్తం చేశారు. ఆమెను ఆత్మహత్య చేసుకునే విధంగా సోషల్ మీడియాలో చిత్రవధకు గురిచేసిన టీడీపీ, జనసేన సోషల్ మీడియా ప్రతినిధులు, లోకేష్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ కుటుంబానికి, చిన్నారులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి మంచి మనసును చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ మహిళా శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడబిడ్డను వేధించిన దోషులను కఠినంగా శిక్షించాలి




పాత మద్రాసు రోడ్డుపై బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): ఆడబిడ్డపై సోషల్ మీడియా వేదికగా అమానుష దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంఘాలు, వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. జగనన్న ఇంటి పట్టా ఇచ్చారని సంతోషంగా మీడియాకు చెప్పిన తెనాలికి చెందిన గీతాంజలిని టీడీపీ, జనసేన మూకలు తమ సోషల్ మీడియా వేదికలపై వికృతంగా వేధించి, అసభ్యంగా దూషించి మానసిక క్షోభకు గురిచెయ్యడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం మండల పరిధిలోని గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై కోయవారిపాలెంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతాంజలికి నివాళులర్పిస్తూ ఫ్లెక్సీలతో రోడ్డుపై రాస్తారోకో చేశారు. దోషులను వెంటనే శిక్షించాలి, ఉయ్ వాంట్ జస్టిస్, జోహార్ గీతాంజలి జోహార్ గీతాంజలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీసీ సంఘాలకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు తమ సంఘీభావం తెలిపి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు జింకా వెంకటేశ్వర్లు, జాజుల శ్రీనాథ్, అప్పారావు, కొక్కెర బాజీ, వాసిమళ్ల రత్నబాబు, జొన్నలగడ్డ శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ఆర్డీవో పి. శ్రీకర్



ప్రత్తిపాడు: పద్నాలుగేళ్ల లోపు చిన్నారులను ఎన్నికల ప్రచారానికి వినియోగించవద్దని ఆర్డీవో పి.శ్రీకర్ ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల్లో మార్పులు, ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అర్జీలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత రాజకీయ పార్టీలు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నోటిఫికేషన్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై ఆర్డీవో నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ పద్నాలుగేళ్ల లోపు వారిని ఎన్నికల ప్రచారానికి వినియోగిస్తే చట్టపరంగా సంబంధిత రాజకీయ పార్టీల నాయకులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

కోత, కుట్లు లేకుండా పేగులో గడ్డ తొలగింపు

గుంటూరు జీజీహెచ్ వైద్యుల ఘనత



గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న రోగికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కోత, కుట్లు లేకుండా చికిత్స చేసి వ్యాధి నుంచి విముక్తి చేశారు. అరుదైన చికిత్స అందించిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మంగళవారం అభినందించారు. ప్రకాశం జిల్లా నేరేడు పల్లి గ్రామానికి కి చెందిన 56 ఏళ్ల గణేషుని కోటమ్మ గత నాలుగేళ్లుగా చిన్న పేగులో గడ్డ తో బాధపడుతోంది. ఈ నెల 5న గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ అనుముల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా కోటమ్మకు అన్నీ రకాల వైద్య పరీక్షలు చేసి, చిన్నపేగులో మూడు సెంటీమీటర్ల గడ్డ ఉందని(డ్యూడెనల్ పాలిప్) నిర్ధారించారు. ఈ నెల 7న ఎలాంటి కోత, కుట్లు లేకుండా ఎండో స్కోపీ ద్వారా గడ్డను విజయవంతంగా తొలగించారు. సుమారు రూ.2లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశారు. కోటమ్మ పూర్తి ఆరోగ్యంగా ఉండటంతో మంగళవారం ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ రామకృష్ణ, డాక్టర్ అనీల్ కుమార్, మత్తు వైద్యులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ పోలయ్య పాల్గొన్నారు.